సాక్షి
కర్నూలు
మంగళవారం : 27 : జూన్ : 2023



ముగిసిన బదిలీల కౌన్సెలింగ్

కర్నూలు (టౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లా వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం సాయంత్రం కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ముగిసింది.



సంగమేశ్వరుడికి పూజలు

కొత్తపల్లి: సంగమేశ్వరాలయంలో సోమవారం భక్తులు ఆషాఢమాస పూజలు చేశారు. సంగమేశ్వరుడికి నదీజలాలతో అభిషేకం, కుంకుమార్చన చేశారు.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ చేపట్టారు. మండపంలో వెయ్యి దీపాలను వెలిగించిన అనంతరం వెండిరథోత్సవం నిర్వహించారు.

పేదలకు ఆరోగ్య సిరి

- జిల్లాలో 6,20,735 ఆరోగ్యశ్రీ కార్డులు
- 3,225 సర్జికల్ ప్రొసీజర్లు
- 89 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ అమలు
- నాలుగేళ్లలో 1,91,964 మందికి లబ్ధి
- రూ.403 కోట్ల ప్రయోజనం
- ఆసరా ద్వారా మరో రూ.43 కోట్ల లబ్ధి

కర్నూలు(హాస్పిటల్): జేబులో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కొండంత ధైర్యం. ఎలాంటి రోగమొచ్చినా రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం అందుకోవడానికి ఈ కార్డు ఉపయోగపడుతుందనే భరోసా. గతంలో మాదిరిగా వైద్యం కోసం ఎలాంటి అప్పులూ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఉన్న ఇల్లూ, ఆస్తులు తాకట్టు పెట్టాల్సిన అగత్యం రాదు. ఈ కార్డు తీసుకెళితే చాలు కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా ఉచితంగా వైద్యం అందుకునే అవకాశం ఏర్పడుతుందనే నమ్మకం పేద ప్రజల్లో నెలకొంది. ఈ మేరకు జిల్లాలో గత నాలుగేళ్ల కాలంలో ఈ పథకం కింద చికిత్స పొందే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వస్తోంది. జిల్లాలో మొత్తం 6,20,735 కుటుంబాలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కార్డులున్నాయి. ఈ పథకం కింద 3,255 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో 42 ప్రభుత్వ, 27 ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఈ పథకం అమలు అవుతోంది. పథకాన్ని అమలు చేసేందుకు గాను జిల్లా స్థాయిలో కో ఆర్డినేటర్ ఒకరు, ఒక జిల్లా మేనేజర్, ఏడుగురు నెట్‌వర్క్ టీమ్ లీడర్లు, ఇద్దరు ఆఫీస్ అసిస్టెంట్లు, 106 మంది ఆరోగ్యమిత్రలు సేవలందిస్తున్నారు. ఈ పథకం ప్రారంభం నుంచి 2,81,547 మందికి చికిత్స చేయగా రూ.662.02 కోట్ల ప్రయోజనం చేకూరింది. ఇందులో గత నాలుగేళ్లలో 1,91,964 మందికి చికిత్స చేయగా ఈ మేరకు రూ.403.05కోట్ల మొత్తం ప్రయోజనం(క్లెయిమ్) చేకూరింది.

నాలుగేళ్లలో ఆరోగ్యశ్రీలో చికిత్సల వివరాలు

సంవత్సరం	మొత్తం చికిత్సలు	క్లెయిమ్ అయిన మొత్తం (రూ.కోట్లు)
2019-2020	35,819	78.21
2020-2021	42,325	99.66
2021-2022	53,459	106.05
2022-2023	60,361	119.13

ఆసరా పథకంతో మరింత ఊరట

డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స పొంది డిశ్చార్జ్ అయి ఇంటికి వెళ్లిన వారు కొంత కాలం పాటు విశ్రాంతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో వారికి పనిదినాలు పోవడంతో పాటు ఆర్థికంగా ఇబ్బంది అవుతుంది. ఇలాంటి ఇబ్బందులను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మనసుతో మరింత ఊరట కల్పిస్తోంది. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనూ ఆసరా పథకంతో ఆదుకుంటోంది. రోజుకు రూ.275 తగ్గకుండా, నెలకు రూ.5వేలకు మించకుండా సహాయాన్ని నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తోంది. ఆయా వ్యాధులు, అందించిన చికిత్సను బట్టి విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో ఈ మొత్తాన్ని లబ్ధిదారునికి అందిస్తున్నారు. ఈ మేరకు ఇప్పటి వరకు 83,798 మంది లబ్ధిపొందగా వారి బ్యాంకు ఖాతాలో రూ.43.38కోట్లు జమ అయ్యాయి.



ఆరోగ్యశ్రీ కియోస్క్

రూ.3 లక్షల సర్జరీ ఉచితంగా చేశారు



నాకు గుండెలో ఐదు చోట్ల అడ్డంకులు ఉన్నాయని వైద్యులు తెలిపారు. కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో గుండెకు సర్జరీ చేయించుకున్నాను. సర్జరీకి దాదాపు రూ.3 లక్షల దాకా ఖర్చయిందని వైద్యులు చెప్పారు. ఇప్పుడు ఆరోగ్యం బాగా ఉంది. అంత ఖరీదైన ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

– పంటా జయమ్మ, బూజునూరు, గడివేముల

క్యాన్సర్‌కు చికిత్స తీసుకుంటున్నాను



నాకున్న నాలుగెకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత సంవత్సరం నాకు పెద్ద ప్రేగు క్యాన్సర్ ఉన్నట్లు బయటపడింది. దీంతో వ్యాధితో పాటు వైద్యానికయ్యే ఖర్చును తలచుకుని భయపడ్డాను. అయితే ఆరోగ్యశ్రీలో ఈ వ్యాధికి ఉచితంగా చికిత్స చేస్తారని తెలుసుకుని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో 8 నెలలుగా కీమో థెరపీ తీసుకుంటున్నాను. ప్రస్తుతం ఆరోగ్యం కుదుటపడుతోంది. ఆపద కాలంలో ఆరోగ్యశ్రీ పథకం నన్ను ఆదుకుంది.

-హరికృష్ణారెడ్డి, మామిదాలపాడు, కర్నూలు

పేదలకు వరం



పేద ప్రజలకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం వరంగా పనిచేస్తోంది. కొన్ని వేల రూపాయల ఖర్చు అయ్యే వ్యాధులు సైతం ఒక్క రూపాయి అవసరం లేకుండా ఉచితంగా ఈ పథకం ద్వారా చికిత్స అందిస్తున్నారు. ప్రతి నెలా కొన్ని వందల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రాణదానం జరుగుతోంది. ఈ పథకం లేకపోతే ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం అయ్యే ఖర్చు భరించలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోయేవారు. ఆరోగ్యశ్రీలో చికిత్స పొందే రోగులు ఏ ఆసుపత్రిలోనూ ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పనిలేదు. ఎవ్వరైనా డబ్బులు అడిగితే మా కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

-డాక్టర్ రఘు, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్, కర్నూలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం పేరుతో మోసం

- స్పందనలో ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: గుంటూరుకు చెందిన ఎస్ఎం గ్లోబల్ సొల్యూషన్స్ వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు ఎస్.నాగప్ప వీధికి చెందిన రవిశంకర్ ఎస్పీ కృష్ణకాంత్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి నేరుగా వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమానికి మొత్తం 120 ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావుతో పాటు సీఐలు పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- ఆన్‌లైన్‌లో టాస్కులు ఇచ్చి కమీషన్ ఇస్తామని చెప్పి డబ్బు తీసుకుని కొందరు మోసం చేశారని కర్నూలుకు చెందిన రాజేంద్రరావు, క్రెడిట్ కార్డుకు ఆన్‌లైన్‌లో సిబిల్ స్కోర్ పెంచుతామని కొంతమంది మోసం చేసినట్లు కల్లూరుకు చెందిన వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశారు.
- ఎల్ఐసీ బీమా డబ్బులు ఇప్పించినందుకు గాను కమీషన్ ఖర్చుల పేరుతో ఒక వ్యక్తి డబ్బులు తీసుకుని మోసం చేశాడని దేవనకొండకు చెందిన హమతుల్లా బీ ఫిర్యాదు చేశారు.
- పొలానికి వెళ్లనివ్వకుండా రస్తా విషయంలో కొందరు అడ్డు పడుతున్నారని సి.బెళగల్ మండలం బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రాంబాబు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

న్యూరోసర్జరీలో పీడియాట్రిక్ ఐసీయూ



పీడియాట్రిక్ ఐసీయూ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ నరేంద్రనాథ్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరోసర్జరీ విభాగంలో పీడియాట్రిక్ ఐసీయూను సోమవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలోని ఈ విభాగానికి ఆరు ఐసీయూ మంచాలు, ఆరు మానిటర్లు, ఆరు సెంట్రల్ ఆక్సిజన్ ఫ్లో మీటర్లు ఇతరత్రా సామగ్రి సమకూర్చామన్నారు. రిటైర్డ్ న్యూరో సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ ఐ.దినకరన్ రూ.5లక్షల విలువైన పీడియాట్రిక్ ఐసీ యూ సెటప్‌లను విరాళంగా అందజేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యూరోసర్జరీ హెచ్‌ఓడి డాక్టర్ డబ్ల్యు సీతారామ్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ పుండరీకాక్షయ్య, డాక్టర్ రామశివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

టమాట కొరత

- కర్నూలు రైతుబజార్‌లో కిలో ధర రూ.80

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో టమాటకు తీవ్ర కొరత ఏర్పడింది. టమాట పండే జిల్లాల్లో కర్నూలు కూడా ఒకటి అయినప్పటికీ ప్రస్తుతం జిల్లాలో ఎక్కడా టమాట పంట కనిపించని పరిస్థితి. అన్‌సీజన్ కావడం వల్ల అన్ని జిల్లాలోను ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో టమాట ధర ఆకాన్నంటుతోంది. కర్నూలు రైతుబజార్లలోనే కిలో టమాట ధర రూ.80 ఉండటం గమనార్హం. ఇక బయట కిలో రూ.100 వరకు విక్రయిస్తున్నారు. చిత్తూరు, అనంతపురం జిల్లాల నుంచి జిల్లాకు టమాట వస్తోంది. ఈ జిల్లాల్లో తీగజాతి టమాట సాగవుతోంది. అందువల్ల ఆ జిల్లాలో టమాట ఇప్పుడు కూడా పండుతోంది. టమాట ధరలను మరి కొన్ని రోజులు భరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో పండించిన టమాట మార్కెట్‌లోకి వస్తేనే ధరలు దిగి వచ్చే అవకాశం ఉంది.

వజ్రం లభ్యం

తుగ్గలి: మండల పరిధిలోని రామాపురంలో సోమవారం పొలం పనులకు వెళ్లిన ఓ మహిళకు వజ్రం లభ్యమైనట్లు సమాచారం. ఆముదం విత్తనం నాటుతుండగా వజ్రం లభించగా.. ఓ వ్యాపారి రూ.1.30లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో ఒక మోస్తరు వర్షాలు

ప్రాంతం	వర్షపాతం (మి.మీ)
మిడుతూరు	22.4
ఆత్మకూరు	19.2
చిప్పగిరి	18.6
డోన్	17.6
పాణ్యం	16.2
ప్యాపిలి	15.4
హాలహర్వి	15.2

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. ఉమ్మడి జిల్లా మొత్తం సగటున 11.5 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు కర్నూలు జిల్లాలో 4.1, నంద్యాల జిల్లాలో 7.4 మి.మీ ప్రకారం వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 76.8 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 58.2 మి.మీ వర్షపాతం.. కర్నూలు జిల్లాలో జూన్ నెల సాధారణ వర్షపాతం 77.7 మి.మీ ఉండగా ఇప్పటి వరకు 44 మి.మీ వర్షం కురిసింది. కర్నూలు జిల్లాలో 13 మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. కాగా బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు, మూడు రోజుల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

28న 'అమ్మ ఒడి'

కర్నూలు సిటీ: జగనన్న అమ్మఒడి పథకాన్ని ఈ నెల 28వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లాలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారని డీఈఓ రంగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ఆదే రోజు కర్నూలు మండల పరిధిలోని మిలటరీ కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి వచ్చే నెల 7వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండల కేంద్రం, మున్సిపాలిటీల్లో 'అమ్మ ఒడి' కార్యక్రమాలను నిర్వహిస్తారని తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు సిటీ: ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా టెన్త్ పరీక్షలకు 229 మందికిగాను 199 మంది, ఇంటర్మీడియెట్ పరీక్షలకు 213 మందికిగాను 178 మంది హాజరయ్యారు. ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు'



మహిళలకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

- కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు/దేవనకొండ: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. సోమవారం చెల్లిచెలిమల, బంటుపల్లి తదితర గ్రామాల్లో మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలకరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థతో గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధ్యమైందన్నారు. హామీలు అమలు చేయకుండా తెలుగుదేశం పార్టీ మోసం చేస్తే.. ఇచ్చిన హామీలన్నింటినీ అమలుచేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజావిశ్వాసాన్ని పొందిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామ సచివాలయానికి రూ. 20 లక్షల అభివృద్ధి పనులకు మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత గుమ్మనూరు నారాయణ స్వామి, దేవరగట్టు ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీదేవి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాంభీంనాయుడు, సింగిల్ విండో అధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, పార్టీ నాయకులు దివాకర్ నాయుడు, మద్దిలేటి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

యువ న్యాయవాదులకు ప్రభుత్వ అండ

- వైఎస్ఆర్ లా నేస్తం కింద 128 మంది యువ న్యాయవాదులకు ఆర్థిక చేయూత
- ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సంబంధించి రూ. 23.15 లక్షల విడుదల
- లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందించిన జిల్లా కలెక్టర్; ఎమ్మెల్సీ, పత్తికొండ ఎమ్మెల్యే



మెగా చెక్కును యువ న్యాయవాదులకు అందజేస్తున్న కలెక్టర్ సృజన, ఎమ్మెల్సీ మధుసూదన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తదితరులు

కర్నూలు(సెంట్రల్): యువ న్యాయవాదులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ వైఎస్ఆర్ లా నేస్తం కింద ప్రతి నెలా రూ.5వేల స్టైఫండ్ ఇస్తోందని ఎమ్మెల్సీ డాక్టర్ ఎ. మధుసూదన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్ఆర్ లా నేస్తానికి సంబంధించి నిధులను బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ డాక్టర్ ఎ. మధుసూదన్, పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, కలెక్టర్ డాక్టర్ జి.సృజనతోపాటు యువ న్యాయవాదులు వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్టును ఏర్పాటు చేసిందన్నారు. ఈ ట్రస్టు నుంచి న్యాయవాదుల అవసరాలకు రుణాలు, గ్రూపు మెడిక్లెయిమ్ పాలసీ, ఇతర అవసరాల కోసం రుణాలు ఇస్తుందన్నారు. ఇప్పటికే ఈ ట్రస్టు ద్వారా రూ.25 కోట్లను న్యాయ వాదుల అవసరాల కోసం వినియోగించినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 128 మంది యువ న్యాయవాదులకు వైఎస్ఆర్ లా నేస్తం అందుతోందన్నారు. వీరికి 2023 ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రూ. 23,15,000 మొత్తాన్ని బ్యాంక్ ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. న్యాయవాదులకు ఆర్థిక స్వావలంబన కోసం రాష్ట్ర ప్రభుత్వం 2019 నుంచి వైఎస్ఆర్ లా నేస్తం పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జూనియర్ న్యాయవాదులు వృత్తిలో ఇంకా రాణించేందుకు లా నేస్తం ఎంతో ఉపయోగపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు యువ న్యాయవాదులకు మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ రమాదేవి, సీనియర్ న్యాయవాది సత్యనారాయణమ్మ, న్యాయవాది అర్సియా పర్వీను, డీఎల్‌డీఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

నర్సరీల ఇష్టారాజ్యానికి చెక్

- చట్టంలో సమూల మార్పులు చేసిన ప్రభుత్వం
- 84 నర్సరీలకు లైసెన్స్‌లు జారీ చేసిన ఉద్యాన శాఖ
- నాణ్యమైన, చీడపీడలకు తావు లేని నారు మొక్కలు సరఫరా లక్ష్యంగా చర్యలు
- ఈ ఏడాది భారీగా పెరగనున్న ఉద్యాన పంటల సాగు
- పంటలు దెబ్బతింటే మొదట నర్సరీ నిర్వాహకులదే బాధ్యత

జవాబుదారీతనం 'పెంచుతూ'!

నర్సరీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఏ కంపెనీలకు చెందిన విత్తనాలతో నారు పెంచారు.. పెంపకంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారనే విషయాలపై స్పష్టత కొరవడింది. మొక్కలు నాటుకున్న తర్వాత దెబ్బతింటే నర్సరీల నిర్వాహకులు సంబంధం లేదన్నట్లు చేతులెత్తేస్తున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రీకరణ(క్రమబద్ధీకరణ) చట్టం-2010కి సమూల మార్పులు చేసింది. రైతుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా చట్టానికి మెరుగులు దిద్దడం విశేషం.

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. ఇటీవల కాలంలో రైతులు అధిక శాతం నర్సరీలలో పెంచిన నారునే కొనుగోలు చేస్తున్నారు. మిరపతో పాటు టమాట, ఉల్లి ఇతర అన్ని రకాల కూరగాయల మొక్కలకు రైతులు నర్సరీలపైనే ఆధారపడుతున్నారు. అయితే మొక్కల నాణ్యతను గతంలో ఎవ్వరూ పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నర్సరీల నిర్వహణలో సమూల మార్పులు తేవడంతో పాటు నిర్వాహకులలో జవాబుదారీతనాన్ని పెంచింది. ఆ మేరకు ప్రతి నర్సరీకి ఉద్యాన శాఖ నుంచి విధిగా లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు జిల్లాలో 84 నర్సరీలకు లైసెన్స్‌లు జారీ చేశారు. ఇక మీదట నర్సరీల నిర్వాహకులు 100 శాతం పారదర్శకంగా, అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. నారు పెంపకానికి ఏ కంపెనీల నుంచి ఏ వెరైటీల విత్తనాలు తెచ్చింది.. వాటి లాట్ నెంబర్లతో సహా రికార్డు చేయాలి. ఇందుకు సంబంధించిన బిల్లులు, విత్తనాల సంచులు జాగ్రత్త చేయడం తప్పనిసరి. మొక్కల పెంపకానికి పాటించిన పద్ధతులను కూడా రాయాల్సిందే. మొక్కలు విక్రయించే సమయంలో ఏ రైతుకు ఏ మొక్కలు ఎన్ని ఇచ్చారనే సమాచారం కూడా రికార్డుల్లో పొందుపర్చాలి. నర్సరీల నిర్వహణకు సంబంధించి మూడు రకాల రికార్డులను నిర్వహించాలి. ఇందులో భాగంగా ఉద్యాన అధికారులు కూడా నర్సరీలపై ప్రత్యేక దృష్టి సారిస్తుండటం విశేషం.

నర్సరీల్లో జోరుగా నారు పెంపకం

ఈ ఏడాది ఉద్యాన పంటల సాగు గణనీయంగా పెరిగే అవకాశం ఉండటంతో నర్సరీల్లో నారు పెంపకం జోరుగా సాగుతోంది. మిర్చి, టమాట, ఉల్లి ఇతర అన్ని రకాల కూరగాయల నారు నర్సరీల్లో సిద్ధమవుతోంది. రైతులు నారు కొనుగోలు సమయంలో విత్తన కంపెనీలు, విత్తన రకాలు, మొక్కలు పెంచిన విధానం తదితరాలను తప్పక పరిశీలించాలి. మొక్కల కొనుగోలుకు సంబంధించిన బిల్లు తీసుకోవడంతో పాటు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రతపర్చుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.



నారు మొక్కలతో కళకళలాడుతున్న నర్సరీలు

రైతుల హక్కుల పరిరక్షణకు పెద్దపీట



గతంలో నర్సరీల నిర్వహణ ఇష్టారాజ్యంగా ఉంది. నారు కొన్న రైతులకు బిల్లులు ఇచ్చేవారు కాదు. పంట దెబ్బతింటే మాకు సంబంధం లేదన్నట్లు వ్యవహరించారు. ప్రభుత్వం రైతుల అభ్యున్నతే లక్ష్యంగా నర్సరీల చట్టంలో సమూల మార్పులు తెచ్చింది. నర్సరీలకు లైసెన్స్‌ను తప్పనిసరి చేస్తూ.. రూ.1000 ఫీజును నిర్ణయించింది. ఉద్యాన అధికారి నెలకోసారి నర్సరీలను సందర్శించి రికార్డులను తనిఖీ చేస్తారు.

– పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

సమూల మార్పులు

- నర్సరీల నుంచి నాణ్యత కలిగిన మొక్కలను సరఫరా చేయడం
- అధిక దిగుబడినిచ్చే రకాల(వంగడాలు) మొక్కలు అందుబాటులోకి తేవడం.
- మొక్కల ఉత్పత్తిలో వినియోగించిన అంటుకొమ్మ(సయాన్), వేరు మొక్క(రూట్‌స్టాక్) తదితర వివరాల మొత్తం రికార్డును కలిగి ఉండటం.
- చీడలు, తెగుళ్లు లేని నాణ్యత కలిగిన ఆరోగ్యకరమైన మొక్కలను ఉత్పత్తి చేయడం.
- నర్సరీలలో ఉత్పత్తి చేసిన మొక్కలు విక్రయించడంలో పారదర్శకత.
- ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు, బయటి నుంచి మన రాష్ట్రానికి ఉద్యాన మొక్కల ఎగుమతి, దిగుమతి చేయడంలో నియంత్రణ.



నర్సరీ నిర్వహణలో నిర్వాహకుడు

ప్రైవేట్ పాఠశాలలో తనిఖీలు

- పుస్తకాల దుకాణం మూసివేత



పుస్తకాల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎంఈవోలు

మంత్రాలయం రూరల్: అధిక ఫీజులు వసూలు చేయడంతోపాటు పుస్తకాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నారనే ఫిర్యాదు మేరకు మంత్రాలయంలోని జీనియస్ గ్లోబల్ ప్రైవేటు పాఠశాలలో మండల విద్యాధికారులు మోయినుద్దీన్, రాఘన్న తనిఖీలు నిర్వహించారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, ధరల పట్టిక, దుస్తుల రంగులు బోర్డులో అతికించలేదని పాఠశాల యాజమాన్యంపై ఎంఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. 40 శాతం ఫీజు చెల్లించాకే పుస్తకాలను ఇస్తామని చెప్పడం చట్టరీత్యా నేరమన్నారు. పాఠశాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయి? తల్లిదండ్రుల నుంచి ఎందుకు అధికంగా ఫీజులు వసూలు చేశారో మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల పక్కనే ఓ దుకాణంలో పుస్తకాలను నిల్వ చేసి విక్రయిస్తుండగా..దానిని మూయించారు. ఉన్నతాధికారులు ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి పుస్తకాలను విక్రయించరాదని ఆదేశించారు.



వనం.. సోయగం

ఇటీవల కురిసిన వర్షాలకు కర్నూలు సమీపంలోని నగరవనం సరికొత్త అందాలను అద్దుకుంది. పచ్చని వృక్షాలతో కనువిందు చేస్తోంది. చెరువులో బోటింగ్ మరచిపోలేని అనుభూతిని మిగుల్చుతోంది. వర్షిస్తున్న మేఘాలు ఒక వైపు.. పరచుకున్న పచ్చదనం ఇంకో వైపు.. నిండుకుండను తలపించే చెరువు మరోవైపు.. సోమవారం నగరవనంలో కనిపించిన సోయగమిది. –సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

ఉత్పాదకరంగంతో ఉజ్వల భవిష్యత్తు

- జేఎన్‌టీయూ వీసీ ఆచార్య జి.రంగ జనార్దన



స్నాతకోత్సవంలో విద్యార్థిని అభినందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ జి.రంగ జనార్దన

కర్నూలు సిటీ: యువత కేవలం సేవా రంగంపై మొగ్గు చూపకుండా ఉత్పాదక రంగం వైపు అడుగులు వేస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జేఎన్‌టీయూ వీసీ ఆచార్య జి.రంగ జనార్దన అన్నారు. చిన్న దేశాలైన తైవాన్, దక్షిణ కొరియా ఆర్థికంగా నిలదొక్కుకున్నాయంటే ఉత్పాదక రంగంలో సాధించిన అభివృద్ధే కారణమని పేర్కొన్నారు. జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ ద్వితీయ స్నాతకోత్సవాన్ని సోమవారం ఆ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు ఆర్థిక రంగంపై ఆధారపడి ఉంటుందన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. కర్నూలులో తమ విద్యాసంస్థలు డీమ్డ్ యూనివర్సిటీలకు దీటుగా ప్లేస్మెంట్స్ సాధిస్తూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు గట్టి భరోసా ఇస్తున్నాయన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్ మాట్లాడుతూ పట్టభద్రులైన ప్రతి విద్యార్థి జాతి నిర్మాణంలో పాలుపంచుకోవాలన్నారు. అనంతరం బ్రాంచీల వారీగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. మొత్తం 489 మందికి పట్టాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు, కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై. పాండురంగయ్య పాల్గొన్నారు.



మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

- మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్పీ పిలుపు



కర్నూలులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

కర్నూలు : యువకులు, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కృష్ణకాంత్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కర్నూలులో డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో జిల్లాపరిషత్ వద్ద నుంచి కొండారెడ్డి బురుజు వరకు పోలీసులు, విద్యార్థులు కలసి భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ, ఆలూరు, కోసిగి ప్రాంతాల్లో కూడా పోలీసు శాఖ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ డేపై అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను యువతకు, విద్యార్థులకు వివరిస్తూ పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 74 కళాశాలల వద్ద హోర్డింగ్స్, పోస్టర్స్‌ను ఏర్పాటు చేశారు. 20 కళాశాలల్లో అవగాహనా సదస్సులు నిర్వహించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి కలిగి ఉన్నా, వాడినా, రవాణా చేసినా అలాంటి వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

- కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ డేపై సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో సీఐలు శంకరయ్య, శ్రీనివాసులు, శ్రీరామ్‌తో పాటు ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో విద్యుత్ ఆపరేషన్స్ డివిజన్

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ డివిజన్ కార్యాలయం ఎమ్మిగనూరులో ఏర్పాటు కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆదోని పట్టణంలో ఉన్న కేంద్రం నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. అయితే, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడం, పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మిగనూరులో డివిజన్ కేంద్రం ఏర్పాటుకు నిర్ణయించారు. ఉమ్మడి కర్నూలు జిల్లా(సర్కిల్)లో ఐదు ఆపరేషన్స్ డివిజన్లు ఉండగా పశ్చిమ ప్రాంతం ఆదోని రెవెన్యూ డివిజన్‌లో ఒక్కటే ఉంది. పెద్ద డివిజన్ కావడం, జిల్లాలో ఆ డివిజన్ అన్ని రంగాల్లో వెనుకబడి ఉండటాన్ని గుర్తించిన ప్రభుత్వం రెండుగా విభజించి సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో వేటిని ఎమ్మిగనూరులో కలిపి డివిజన్ ఏర్పాటు చేయాలనే విషయమై కసరత్తు కొనసాగుతోంది. కొత్త డివిజన్ ఏర్పాటైతే ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది ఇక్కడే ఉండనున్నారు. కోడుమూరు సమీపంలోని వేముగోడుతో పాటు ఎర్రబాడు.. సి.బెళగల్ సమీపంలో ఉన్న గ్రామస్తులు తమ పనుల నిమిత్తం ఆదోనిలోని ఈఈ కార్యాయానికి వెళ్లాల్సిన అవసరం ఇక మీదట తప్పుతుందని ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి తెలిపారు.

నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో మంత్రి బుగ్గన పర్యటన

డోన్: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మంగళవారం నుంచి నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ఐదు రోజుల పాటు పర్యటించనున్నారు. 27న కర్నూలు స్టేట్ గెస్ట్‌హౌస్‌కు చేరుకొని జిల్లా ఎస్పీ, కలెక్టర్లతో సమీక్ష నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం నంద్యాల చేరుకొని అక్కడ వసతి గృహంలో జిల్లా కలెక్టర్, ఎంపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్మన్‌తో సమావేశమవుతారు. 28న బేతంచెర్ల ఆటోనగర్‌కు భూమిపూజ చేస్తారు. ఆతర్వాత కేకే కొట్టాల గ్రామంలో ఒక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఇదే మండలంలోని బిల్లల స్వర్గం గుహలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత బేతంచెర్లలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. 29న ప్యాపిలి పట్టణంలో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి భూమిపూజ చేసి, వసతిగృహం, పార్కుల నిర్మాణ పనులను పరిశీలిస్తారు. అనంతరం జరిగే యువజనుల సమావేశంలో పాల్గొంటారు. 30న మండలంలోని యు. కొత్తపల్లె గ్రామ సచివాలయం, ఆరోగ్యకేంద్ర భవనాలను ప్రారంభిస్తారు. అనంతరం కొత్తకోట నుంచి కొత్తబురుజు వరకు పంచాయతీరాజ్ శాఖ నిర్మించిన రోడ్డుపై పాదయాత్ర చేస్తారు. జూలై 1న డోన్ పట్టణంలో రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు భూమి పూజ చేయడంతో పాటు నూతన మునిసిపల్ పరిపాలన భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం విజయ డెయిరీలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు.

మాస్ మీడియా అధికారిగా ప్రమీలాదేవి



డెమో ప్రమీలమ్మకు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని మాస్ మీడియా అధికారి(డెమో)గా ఎం. ప్రమీలాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్ఆర్ జిల్లా కడపలో వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డెమోగా పనిచేస్తున్న ఆమె సాధారణ బదిలీల్లో భాగంగా కర్నూలుకు బదిలీ అయ్యారు. బాధ్యతలు తీసుకున్న ఆమెకు డిప్యూటీ డెమో చంద్రశేఖర్, హెచ్ఈవో శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ అభినందనలు తెలిపారు.

నేడు ధర్మకర్తల మండలి సమావేశం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఈ సమావేశంలో భక్తుల సౌకర్యార్థం, క్షేత్రాభివృద్ధికి సంబంధించి పలు అంశాలను చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు. ధర్మకర్తల మండలి సమావేశంలో పాల్గొనేందుకు ఇప్పటికే చైర్మన్, సభ్యులు శ్రీశైలంచేరుకున్నారు. అలాగే ఈ సమావేశానికి శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరుకానున్నారు.

టైప్‌రైటింగ్‌లో కోసిగి విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్ర స్థాయి 2వ ర్యాంక్



పురందేశ్వరి

కోసిగి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పురందేశ్వరి అనే విద్యార్థిని టైప్ రైటింగ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంక్ సాధించింది. ఈ విద్యార్థిని ఫిబ్రవరిలో జూనియర్ గ్రేడ్ టైప్‌రైటింగ్ పరీక్ష రాయగా ఇటీవల విడుదలైన ఫలితాల్లో 200 మార్కులకు గానూ 191 మార్కులు వచ్చాయి. విద్యార్థినిని ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, టైప్‌రైటింగ్‌లో శిక్షణ ఇచ్చిన కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కేశవరెడ్డి అభినందించారు.